క్లుప్తంగా

సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు



ఉమామహేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని సప్తనదీ తీరంలోని సంగమేశ్వరంలో ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలయపక్షంలో చివరి సోమవారం భాద్రపద మాసంలో నాల్గవ సోమవారాన్ని పురస్కరించుకొని స్వామివార్లకు భక్తులు నదిజలాలతో అభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి గావించారు.

గో సంరక్షణనిధికి విరాళాలు



సికింద్రాబాద్‌కు చెందిన దాతలకు జ్ఞాపికను అందజేస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం గో సంరక్షణార్థం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధికి సోమవారం పలువురు దాతలు విరాళాలను అందజేశారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన జె.శ్రీనివాస విజయ గణపతి రూ.1,00,116, సికింద్రాబాద్ కు చెందిన కె. ఉమామహేశ్వరరావు రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని పర్యవేక్షకులు నాగరాజుకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

గర్భిణులకు అన్నదానం



గర్భిణులకు అన్నం వడ్డిస్తున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య

నందికొట్కూరు: వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణుల ఆకలి తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని ఎస్ఐ వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు.సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో జవ్వాజి సువకన్న గౌడ్ సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్ష కోసం వచ్చిన గర్భిణులకు సాయిరాం విద్యాసంస్థల అధినేత సుధాకర్‌రెడ్డి కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు. వైద్య సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్ట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

నందికొట్కూరు: కర్నూలుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే వారి కోసం గిఫ్ట్ స్కీం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ప్రయాణికుల సమక్షంలో గిఫ్ట్ స్కీంలో భాగంగా మూడు బస్సు టికెట్లను డిప్ తీయగా మొదటి బహుమతి గణేష్, రెండో బహుమతి బషీర్ అహమ్మద్, మూడో బహుమతి ఉపేంద్ర కుమార్‌లకు అందజేశారు. ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ ఆర్టీసీకి ఆదాయం పెంచేందుకు ఈ స్కీం అమలు చేస్తున్నామన్నారు. ప్రయాణికులు టికెట్ వెనుక భాగంలో పేరు, ఊరు పేరు, సెల్ నెంబరు రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. కార్యక్రమంలో బసిరెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

నందికొట్కూరు: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన మహానేత కాన్షీరాం సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ స్వాములు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని చౌడేశ్వరి దేవాలయం ఎదురుగా ఉన్న బహుజన సమాజ్ పార్టీ అధినేత కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రసాద్, నాగరాజు, సుమంత్, బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

పేదల డాక్టర్ ఇకలేరు



యన్నం చెన్నయ్య (ఫైల్)

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలోని ఈస్టన్‌కాలనీలో పేదల డాక్టర్‌గా పేరొందిన ఆర్ఎంపీ యన్నం చెన్నయ్య అనారోగ్యంతో సోమవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందారు. ఎన్నో సంవత్సరాలుగా పేదలకు ఉచితంగాను, రూ.10 మినిమమ్ ఫీజుతో అనేక మంది రోగులకు ఆయన వైద్య సేవలు అందించారు. అలాగే ప్రతి ఏడాది మహాశివరాత్రి ఉగాది పర్వదినాల్లో విద్యా వికాస రక్ష సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అటవీప్రాంతం పెచ్చెర్వులో నిర్వహించే వైద్యశిబిరంలో పాల్గొని భక్తులకు ఉచితంగా సేవలు అందించేవారు.

వైద్యం ప్రజలకు మరింత చేరువ

- ఐటీ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్
- జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు పరిశీలన

వెలుగోడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువే చేసే వీలు కలిగిందని ఐ.టి.సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్ అన్నారు. పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఎన్ని ఇళ్లను సందర్శించారు, ఎన్ని రక్త పరీక్షలు నిర్వహించారు, గర్భిణులు ఎంత మంది ఉన్నారు,షుగర్ టెస్టు ఎంత మందికి చేశారని ఆరా తీశారు.సర్వే వివరాలను ఎక్కడ అప్‌లోడ్ చేశారని ప్రశ్నించారు. రక్త పరీక్షలు, కంటి పరీక్షలు చేసే విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. హెల్త్ క్యాంపుల్లో భాగంగా ఏడు రకాల వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఏకంగా 118 రకాల మందులను అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. క్షేత్రస్థాయిలో ఇవన్నీ పక్కాగా అమలయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. హెల్త్ క్యాంపులో స్థానిక వైద్యులు సులోచనమ్మ, డాక్టర్ కష్ణమూర్తి, ప్రసన్న లక్ష్మీ, జహీర్‌వలి, సాయి ప్రదీప్‌లు పాల్గొని రోగులకు చికిత్స లు అందించారు.ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ దాసు, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ షేక్ అమా నుల్లా, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న ఐటీ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

వెలుగోడు: ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఐదో సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆరోగ్యానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంటింటా జల్లెడ పట్టి మరీ రోగులను గుర్తించి ఉచితంగా వైద్యసేవలు అందిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కూడా వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయన ప్రత్యేక చొరవతో పట్టణంలో రూ.6.10 కోట్ల నిధులతో సీహెచ్‌సీ ఆసుపత్రిని నిర్మించారని తెలిపారు. క్యాక్రమంలో వైస్ ఎంపీపీ నసిరుద్దీన్, సచివాలయ కన్వీనర్లు పులి సుబ్బారెడ్డి, రామచంద్రుడు, సుబ్బమ్మ, మహమ్మద్ ఖాన్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలి..

పగిడ్యాల: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయమని మండల జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. నెహ్రూనగర్ సచివాలయం–2 పరిధిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. శిబిరంలో 620 మంది రోగులను పరీక్షించిన వైద్యులు 37 మందిని మెరుగైన వైద్యం కోసం (గుండె సమస్యలు, కంటి శుక్లాల సమస్యలు, చర్మ సమస్యలు, తక్కువ బరువు కలిగిన అంగన్‌వాడీ పిల్లలు) ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేసినట్లు వైద్యాధికారి మోహన్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, డాక్టర్లు విలయత్, ప్రవీణ్‌కుమార్, పూర్ణేశ్వరరావు, సబా, అనిల్ కుమార్, ఎంపీటీసీ చంద్రమోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పులేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వెలుగోడులో వైద్య సేవల గురించి ఆరా తీస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి



నెహ్రూనగర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

చాలా సంతోషంగా ఉంది



నాకు 60 ఏళ్లకు పైగా ఉంటాయి. కంటి చూపు లోపం, బీపీ, వంటి సమస్యలతో బాధపడుతున్నాను. మా గ్రామంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ పెట్టి వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉంది. డాక్టర్లు ఓపికగా అన్ని సమస్యలను వింటూ వైద్య సలహాలు ఇస్తున్నారు. పండుగలా గ్రామంలో సందడి సందడి కనిపిస్తోంది.

– పార్వతీ, నెహ్రూనగర్

వినికిడి సమస్యతో బాధపడుతున్నా



గత కొన్నేళ్లుగా వినికిడి సమస్య, కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్నా. 80 ఏళ్ల వయస్సు వచ్చింది. ఆరోగ్య సమస్యలు అధికమయ్యాయి. గ్రామంలోనే వైద్య క్యాంప్ పెట్టి పరీక్షలు చేయడం మాబోటి ముసలొల్లకు వరం. తల నరాలు కూడా బాగా గుంజుతాయి. అన్ని సమస్యలను వైద్యులకు చెప్పాను. మందులు ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

– పాలూరు బాలమ్మ, నెహ్రూనగర్

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు

నందికొట్కూరు రూరల్: మండలంలోని వడ్డెమాను గ్రామంలో జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శోభారాణి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామ సచివాలయం– 2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ సోమవారం తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సురక్ష కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరు కానున్నారని.. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ మేరి సోమవారం తెలిపారు. కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నిష్ణాతులైన వైద్యులతో చిన్నపిల్లలకు, వృద్ధులకు, అందరికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తారని తెలిపారు.

గ్రామాల మధ్య నీటి వివాదం

మహానంది: మండలపరిధిలోని తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాల మధ్య సోమవారం తెలుగుగంగ కాల్వ నీటి విషయంలో వివాదం నెలకొంది. 10వ బ్లాక్ నుంచి రెండు గ్రామాలకు నీరు వెళ్లాల్సి ఉండగా, తమ్మడపల్లె గ్రామస్తులు అడ్డు కట్ట వేసినట్లు తెలియడంతో బొల్లవరం గ్రామ రైతులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. జమాలయ్య దర్గా వద్ద బొల్లవరం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న తెలుగుగంగ ప్రాజెక్ట్ డీఈ నాగమధుసూదన్ రావు, ఏఈ జగదీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిబంధనల మేరకు రెండు గ్రామాలవారు నీళ్లను వాడుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఈ నెల 15 నుంచి 24వ తేది వరకు దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. సోమవారం విజయవాడలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యుత్, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రులకు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈఓ

ముల్లోకాల్లోని తీర్థక్షేత్ర శక్తులన్నీ శ్రీశైలంలో ఉన్నాయి

శ్రీశైలంటెంపుల్: భూమండలంలోని తీర్థాలన్నీ శ్రీశైలంలోని మూర్తులు దాల్చి ఉన్నాయని, ముల్లోకాల్లో ఉన్న తీర్థక్షేత్ర శక్తులన్నీ శ్రీశైలంలో ఉన్నాయని సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న బ్రహ్మశ్రీ 'శ్రీశైల మహిమా విశేషాలు' ప్రవచన కార్యక్రమం తొమ్మిదవ రోజు సోమవారం కొనసాగింది. స్కందపురాణంలో శ్రీశైలఖండంలో పేర్కొనబడిన క్షేత్ర మహిమా విశేషాలను ఎంతో విస్తారంగా వివరించారు. శ్రీశైలక్షేత్రానికి సమగ్రక్షేత్రం అనే ప్రసిద్ధి ఉందన్నారు.

వర్షం కోసం పూజలు

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో వెలసిన శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం వర్షం కోసం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ తదితర పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామివారి సన్నిధిలో నందికోలసేవ, భజన, సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం భక్తుకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పల్లకీలో విహరించిన ఆదిదంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లు సోమవారం రాత్రి పల్లకీలో కొలువై ఆలయ ప్రాకారాల్లో విహరించారు. కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార, హారతి పూజల అనంతరం గోమాతను ముందుగా నడిపిస్తూ ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఎస్సీ జాబితాలో చేర్చే పార్టీలకే మద్దతు

జూపాడుబంగ్లా: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే పార్టీలకే తమ మద్దతు ఇస్తామని రాష్ట్ర రజక సంక్షేమ సంఘం మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి తెలిపారు. సోమవారం మండలంలోని తరిగోపుల గ్రామంలో రజకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రజకులను ఎస్సీజాబితాలో చేర్చుతామని గత 50 ఏళ్లకాలంగా వివిధ పార్టీల నాయకులు నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. దేశంలోని 3 కేంద్ర పాలిత ప్రాంతాలు 12 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీజాబితాల్లో ఉండగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రజకులు బీసీ జాబితాల్లో కొనసాగుతున్నారని తెలిపారు. అనంతరం గ్రామ రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, ప్రచారకార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా నాగభూషణంను ఎన్నుకున్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధికి ప్రణాళికలు

మహానంది: 2030 నాటికి గ్రామాల సుస్థిర అభివృద్ధి కొరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ వాసుదేవగుప్త ఆదేశించారు. బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 22 శాఖలకు సంబంధించిన సమాచారం గ్రామ పంచాయతీ ఫెసిలిటేటర్లకు అందించాలన్నారు. అలాగే ప్రభుత్వం సూచించిన తొమ్మిది అంశాలకు సంబంధిత శాఖ అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ నెల 25వ తేదీ నాటికి ప్రణాళికలను పూర్తి చేయాలని సూచించారు.

సమన్వయంతో సర్వే పూర్తి చేయండి

కొత్తపల్లి: గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సర్వేను సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, అధికారుల సమన్వయంతో పూర్తిచేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సర్వేను ఈనెల 12 లోపు పూర్తిచేసి డిజిటల్ అసిస్టెంట్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాములపాడు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం గ్రామపంచాయతీ డెవలప్మెంట్ ఇండెక్స్‌పై ఎంపీడీఓ గోపీకృష్ణా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీకీ అభివృద్ధికి కావాల్సిన పనులు, ప్రజలకు అవసరమైన నిధులు, ఏఏ అవసరతలు వాటికి నిధులు ఏలా సమకూర్చాలో తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

మహానందిలో సినిమా షూటింగ్

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం పరిధిలో 'అంతు లేని ప్రేమ ఎంతకైనా' సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభించారు. సినీ,హాస్య నటులు గడ్డం నవీన్, అప్పారావు, చిట్టిబాబులతో పాటు మరికొంత మంది నటులు మహానందిలో సందడి చేశారు. వారిని గుర్తించిన అభిమానులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. నటులందరూ ఉదయం ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. మహానంది మండలం తమ్మడపల్లెకు చెందిన వెంకటేశ్వర్లుస్వామి నిర్మాతగా వ్యవహరిస్తుండగా, జయసింహ దర్శకత్వం వహిస్తున్నారు.



మహానందిలో సినీ నటులు నవీన్, అప్పారావు బృందం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రకాశం జిల్లా సరిహద్దు శిఖరేశ్వరం బయన్నసెల వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైరింగం నాగేశ్వరరావు(35) తీవ్రంగా గాయపడ్డారు. గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన నాగేశ్వరరావు శ్రీశైలంలో చిలకజోష్యం చెప్పుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. దోర్నాల వైపు నుంచి ఏపీ07ఈఎ7004 బైక్‌పై వస్తుండగా శ్రీశైలం నుంచి దావణగెరి వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు కేఏ17ఎఫ్2004 ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్సలు చేశారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం 108 వాహనంలో మార్కాపురం తరలించారు.

'స్పందన' సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు రూరల్ : స్పందన కార్యక్రమంలో వచ్చే సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు సూచించారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రం సున్నిపెంటలోని భగత్‌సింగ్ కాలనీలో సిమెంట్ రోడ్లను నిర్మించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి దూరంగా ఉన్న భగత్‌సింగ్‌కాలనీలో రాత్రి వేళల్లో సరైన రోడ్లు లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించి వీధి లైట్లను వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథ జిల్లా అధికార ప్రతినిధి వై.ఆశీర్వాదం, ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీను, మల్లికార్జున, ఆటోమొబైల్స్ వర్కర్స్ యునియన్ నాయకులు ఎస్‌కేబాబు, సమత్ తదితరులు పాల్గొన్నారు

గిరిజనులకు ఇళ్లపట్టాల మంజూరుకు చర్యలు

కొత్తపల్లి: మండలంలోని గిరిజనులకు ఇళ్లపట్టాలు, ఇళ్ల మంజూరు చేయిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలలో సమస్యలు పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే స్థానిక భ్రమరాంబా చెంచుగూడెం నుంచి ఇళ్లపట్టాలు ఉన్నా ఇళ్ల మంజూరు కాలేదని, కొంతమందికి ఇంటిపట్టాలు, ఇల్లులేక ఇబ్బంది పడుతున్నామని 12 మంది విన్నవించారన్నారు. స్పందించిన తహసీల్దార్ ఈ సమస్యను హౌసింగ్ సిబ్బందికి తెలిపి, వెంటనే గిరిజనులకు ఇళ్లు, ఇళ్లపట్టాలు మంజూరు చేయిస్తామన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణా సోమవారం తెలిపారు. మంగళవారం మండలంలోని బానుముక్కల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన వైకేపీ సీసీ

ఆత్మకూరు: పట్టణంలో రెండు రోజులుగా 12 సంవత్సరాల బాలుడు వివిధ షాపుల వద్ద తనకు పని కల్పించాలని కోరుతూ సంచరిస్తున్నాడు. బాలుడిని చూసిన కొందరు వ్యక్తులు ఏ ఊరు, ఎక్కడ నుంచి వచ్చావని అడిగారు. అతను సరైన సమాధానం ఇవ్వకుండా దాట వేశాడు. అయితే ఓ దుకాణయజమాని ఆ బాలుడికి పని కల్పించాడు. వైకేపీ సీసీ యూసఫ్ ఆ షాపు వద్దకు వెళ్లి బాలుడి వివరాలు ఆరా తీశారు. చివరకు ఆ బాలుడు తమది నెల్లూరు జిల్లా, అలివేలు పాలెం గ్రామమని చెప్పాడు. దీంతో అతను నెల్లూరు జిల్లా యానాది సీసీ మస్తాన్‌వలిని సంప్రదించి.. బాలుడి గ్రామాన్ని తెలుసుకున్నారు. ఆ గ్రామ వీఓఏ ద్వారా బాలుడి తల్లిదండ్రులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడించాడు. ఆ అబ్బాయి తమ కుమారుడని పేరు వినయ్ అని, 5 నెలలుగా ఇంటికి రాలేదని వారు విలపించారు. వినయ్‌కి వెలుగు సీసీ యూసఫ్ నచ్చజెప్పి, బస్‌చార్జీలు ఇచ్చి, నంద్యాలలో ఆర్టీసీ డ్రైవర్‌కు చెప్పి బస్సు ఎక్కించారు. ప్రస్తుతం వినయ్ తల్లిదండ్రుల వద్దకు చేరుకున్నాడు. దీంతో యూసఫ్‌కు వినయ్‌తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు



వినయ్‌తో వైకేపీ సీసీ యూసఫ్

నాటుసారా స్వాధీనం

మహానంది: మహానంది సమీపంలోని తెలుగుగంగ వద్ద ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ సోమవారం తెలిపారు. సంజామల మండలం గిద్దలూరుకు చెందిన రామచంద్రుడుతో పాటు మరో ఐదు మందిని అరెస్ట్ చేసి సారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు.

మిడుతూరు: మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో ఓ వ్యక్తి నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగన్‌మోహన్ సోమవారం తెలిపారు. నందికొట్కూరు పట్టణం షికారీ పేటకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి మండలంలోని నాగలూటి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అతడి నుంచి 20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన సునీల్ అనే వ్యక్తి అక్రమంగా గ్రామంలో మద్యం అమ్ముతున్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించగా.. 12 క్వాటర్ బాటిళ్లు లభించాయని చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నందికొట్కూరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తునట్లు డీఎం నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు, సమస్యలతో పాటు డిపో అభివృద్ధికి అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తునట్లు చెప్పారు. ప్రయాణికులు 99592 25799 సెల్ నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం డయల్‌యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆర్టీసీ డీఎం మహేంద్రుడు తెలిపారు.ఉదయం 11 నుంచి 12గంటల వరకు ప్రయాణికులు సమస్యలపై సెల్ నెంబర్9959225801కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

వర్షపు నీరు తొలగింపునకు ఏర్పాట్లు

ఆత్మకూరు: పట్టణంలోని 22వ వార్డులో గత వారం కురిసిన వర్షాలకు నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆ వార్డు పరిధిలో వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని వార్డు కౌన్సిలర్ బోయపార్వతితో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రహదారి వెంట గతంలో వేసిన కుళాయిల ద్వారా నీరు పారకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రోడ్డు వెంట నిల్వ ఉన్న నీటిని తొలగిస్తామన్నారు.



వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ బోయలక్ష్మమ్మ

మహానంది.. భక్తజన సందడి

మహానంది: మహానంది ఆలయం సోమవారం భక్తులతో కళకళలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, స్థానిక అభిషేకార్చనలు, అష్టవిధ మహామంగళహారతులు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన శ్రీకామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులరద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు,ఇన్‌స్పెక్టర్లు ముడియం చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి సుమారు రూ. 4లక్షల వరకు ఆదాయం సమకూరిందని సమాచారం.

క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి

పగిడ్యాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి జూనియర్ విభాగం ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 18 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయి ఖోఖో క్యాంప్‌నకు ఎంపిక చేసినట్లు జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన చిత్తూరు జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పగిడ్యాలలోనే శిక్షణా క్యాంప్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఎన్నికైనా క్రీడాకారులు ఈ శిక్షణా క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని, తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఖోఖో అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి ప్రభాకర్, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాల్గొన్నారు.